# ఆకలి కథ

బాగా డబ్బున్నవాళ్ళు బాగా బలమైనవాళ్ళని పిలిపించి, ఆ ఊరిలో వున్న కొన్ని పాకలను శక్తి కలిగినంత దూరం విసిరించేసినట్టు - ఊరికి దూరంగా అక్కడొకటి, అక్కడొకటి పదోపన్నెండో పాకలు. ఆ పాకలలో ఊరికి కాస్త దగ్గరగావున్న పాక వెంకటస్వామిది.

వెంకటస్వామికి ఊరిమధ్య కాపురముండటానికి అర్హతలు చాలా తక్కువున్నాయి. చదువు, ఉద్యోగం, పలుకుబడీ కూడా లేనివాడతను. అతనికి లేని అర్హతల్లో అన్నిటికన్నా చివరది, ముఖ్యమైందీ అతను డబ్బులేనివాడు కావటం. డబ్బుంటే చదువు, ఉద్యోగం, పలుకుబడీ వాటంతట అవే అతని దగ్గిరకొచ్చి వాలేవి.

అక్కడ కూలిపోయేదో, రాలిపోయేదో ఒక పాక వేసుకున్నాడు కాబట్టిగాని లేకపోతే ఇన్నాళ్ళూ అతను, అతని కూతురు ఎక్కడ తల దాచుకునేవారో అతనికే తెలియదు.

ఇవ్వాల్టివరకూ అతనికి అభిమానం, గౌరవంగా బతకాలనే తాపత్రయం, నీతినియమాలపట్ల సదభిప్రాయం- ఇవన్నీ ఉన్నాయి. కానీ ఇప్పుడతనికి అభిమానంకన్నా, అతను నమ్మిన నీతినియమాలకన్నా మిన్నయైన ఆకలివుంది. అది చల్లార్చుకోవటానికి మార్గం మాత్రం అతని కనుచూపుమేరలో లేదు.

కేవలం అది తన ఒక్కడి ఆకలే అయితే వెంకటస్వామి పరువు కోసం ప్రాణాలైనా వదిలేసుకుని ఆకలిని జయించివుండేవాడేమో బహుశా.

కాని ఏడురోజులు కేవలం మంచినీళ్ళు తాగి ఎలావుండాలో తెలియని అతని కూతురు మాలక్ష్మి ఉలుకూపలుకూ లేకుండా సొమ్మసిల్లి పడు కుంది. త్వరలో ఆమె కేదైనా పెట్టాలి.

చేయని నేరానికి ఉన్న పనిని పోగొట్టుకుని, కొత్త పనికోసం వెతికి వెతికి వేసారిపోయాడు వెంకటస్వామి. పోనీ ఎవరినన్నా అప్పుడు గుదామన్నా తనకు తెలిసున్న అందరూ తనలాగ, తనకన్నా నికృష్టంగా బతుకుతున్నవాళ్ళే. ఎవర్నడగాలి! ఉన్న ఒకే ఒక్క ఆశని చంపుకో వటం ఇష్టంలేక అడగనే అడిగాడు దుర్గని.

వెంకటస్వామి ఇల్లు ఊరికి దగ్గరగావున్న మొదటి పాకయితే దుర్గది దూరంగావున్న మొదటి పాక. ఇద్దరి పాకలకి మధ్య మూడు ఫర్లాంగుల ఎడముంటుంది. పగలు పువ్వులు, రాత్రి ఒళ్ళు అమ్మి బతుకు తుంది దుర్గ. అందుకే మిగతా పాకల్లోవాళ్ళకి పదో పరకో అప్పుకూడ ఇస్తుంటుంది.

కాని—

వెంకటస్వామికి మాత్రం ససేమిరా ఇవ్వనంది. అవునుమరి? వెంకటస్వామి అప్పయితే చేయగలడు కాని, అతను తీర్చే మార్గమేది?

కాళ్ళావేళ్ళాపడ్డాడు వెంకటస్వామి. కసిరికొట్టి తలుపేసుకుంది దుర్గ.

'పోనీ ఇంత అన్నమేనా వుంటే పెట్టు!' అంటూ అడిగాడు వెంకటస్వామి, సగంచచ్చిన స్వరంతో. దుర్గకి వినిపించిందో వినపళ్ళేదో గాని, తలుపు మాత్రం తీయలేదు.

"అమ్మా!............ఆకలి!" అంటూ స్పృహవచ్చినప్పుడల్లా మూలుగుతోంది మాలక్ష్మి. ఆమె ఈతచాపమీద చినిగిన బొంత కప్పుకుని పడుకుని వుంది. ఆమె స్థితి చూసి, ఇంకా చూస్తూ చూస్తూ ఊరుకోలేక

పోయాడు వెంకటస్వామి. పరువు, మర్యాద, నీతి నియమం - వీటి గురించి తనకున్న అభిప్రాయాలు ఒక్కసారిగా చెరిపేసుకుని, లేచి నించుని బైటకు వచ్చి, తలుపులాటి తడిక దగ్గరగా లాగి, పరుగులాటి నడకతో పట్నంకేసి నడిచాడు.

* * *

దొరికినవాళ్ళలో బలమైన కూలీలను ఏరుకుని, వాళ్ళచేత గండ శిలలను సైతం ఎత్తించి అందంగా, అయిశ్వర్యానికి చిహ్నంగా కట్టుకున్న మేడ అది. ఆ మేడగలాయన పేరు వీరభద్రుడు. ఆయన పైసా పైసా కూడబెట్టి లక్షలార్జించాడు. వడ్డీలకు వడ్డీలు గుంజి డబ్బు సంపాదించాడు. అతని ప్రమేయం మీదనే అతని డబ్బు పెరిగింది.

అతని ప్రమేయం లేకుండా పెరిగిందేమిటంటే - అతని బొజ్జ. బొజ్జతోపాటు ఊళ్ళో పలుకుబడీ పెరగింది. పెరగందీ, ఒకింత తరిగిందీ ఏమిటంటే - అతని బుద్ధి.

ఈమధ్య వీరభద్రుడు ఊళ్ళో ఉపన్యాసాలు కూడా ఇస్తున్నాడు. ఆ ఉపన్యాసాలలో మధ్యతరగతి మనుషులమీద, పేదలమీద ఎనలేని సానుభూతి ప్రకటిస్తున్నాడు. వచ్చే మునిసిపల్ ఎన్నికలలో నిలబడి కనీసం కౌన్సిలరు కావాలన్న ఆలోచన అతని అంతరాంతరాళాలలో లేకపోలేదు.

అయితే—

ప్రస్తుతం అతనేంచేస్తున్నాడంటే ఇనప్పెట్టిలోని డబ్బు నాలుగోసారి లెక్కపెట్టుకుని తృప్తిగా నిట్టూర్చడంలో మునిగివున్నాడు.

టైము సరిగ్గా పన్నెండయింది.

ఎప్పుడో ఎనిమిది గంటలకు భార్య తెచ్చిపెట్టిన అన్నం తిని, మేల్కోవటం మంచిదనుకున్నాడు వీరభద్రుడు.

ఎందుకో, అప్పుడే అన్నం తినబుద్ధికాలేదు.

ఇనప్పెట్టి దగ్గరగా స్టూలు లాక్కుని, దానిమీద కంచం పెట్టుకుని, లైటార్పి, తాళాంగుత్తిగోవున్న రేడియమ్ముక్క చీకట్లో మిలమిలా మెరుస్తూవుంటే. ఆ మెరుపులో కంటికి ఇంపుగా, అందంగా ముద్దొస్తున్నట్టున్న అయిరన్ సేఫ్ని చూస్తూ కూచున్నాడు.

*          *          *

పేకాట ఆడి సంపాదించగా వచ్చిన డబ్బుని ఖరీదైన విస్కీలో పూరవేసి కట్టినట్టుగా, చెయ్ వేస్తే ఎక్కడ జారిపోతుందో అనిపించేట్టుగా మలిచిన గోడలు, అంతకన్నా నున్నటి ఫ్లోరింగు. పైరెంటికీ తీసిపోని సీలింగు, ఎంత మూడ్ లేకుండా లోపలికి అడుగుపెట్టినా తాగితీరాలనిపించే వాతావరణం, ఎక్కణ్ణించి వస్తుందో తెలియని అదోరకం సువాసన - అది కాస్మోపోలిటన్ క్లబ్

ఉదయం పదకొండు గంటలనించి రాత్రి పన్నెండు గంటలవరకు అక్కడ ఏడ్రింకు డ్రింకుతామంటే - ఆ డ్రింకు సప్లై చేస్తారు. పేకాటల్లో ఏరకం ఆట ఆడతామంటే, ఆ ఆటకు మనుషుల్ని సిద్ధంచేస్తారు.

అయితే ఆ క్లబ్బులో ఈ రెండిటితోనూ వుండవలసిన మరో సౌకర్యం మాత్రం లేదు.

వచ్చే ఉగాదినుంచి ఆ సౌకర్యం కూడ వుంటుందని అంతవరకు సభ్యుల అసౌకర్యానికి చింతిస్తున్నట్టుగా, లోపాయికారీగా ఇప్పుడే క్లబ్ మేనేజరు మనవి చేసుకున్నాడు.

క్లబ్ లో హర్షధ్వానాలు వెల్లివిరిశాయి—

"కానీ అంతవరకూ ఎలాగః" గొణుక్కుంటున్నట్టుగా అన్నాడు గోపాల్.

"పద బ్రదర్! బైట అరేంజ్ చేసుకుందాం!" అన్నాడు స్నేహితుడు.

"వద్దు నన్ను టాక్సీలో నేను దింపమన్నచోట దింపేయండి" అన్నాడు గోపాల్.

టాక్సీ ఊరిపొలిమేరల్లో ఆగింది—

"ఇక్కడెందుకు బ్రదర్! హాయిగా మంచి హోటల్లో క్లాసమ్మాయి దగ్గరకే పోవచ్చుకదా!!" అడిగాడు స్నేహితుడు గోపాల్ని.

"క్లాసమ్మాయా? క్లాసు క్లాసని అందరూ ఆ అమ్మాయి దగ్గరకే వెళుతున్నపుడు ఆ అమ్మాయి క్లాసెలా అవుతుంది? అయినా లోక్లాస్ వాళ్ళిచ్చిన ఎంజాయిమెంటు హైక్లాస్‌వాళ్ళేమిస్తారు బ్రదర్!" అంటూ టాక్సీ దిగి రెండడుగులేశాడు గోపాల్.

టాక్సీ ఊరివైపు పారిపోయిం తర్వాత కాని చూసుకోలేదు గోపాల్- తను తాగిన మైకంలో పొరబాటున ఆ చివర దిగటానికి బదులు ఈ చివర దిగిపోయాడని.

'దుర్గ ఇంటికి పోవాలంటే రెండు మూడు ఫర్లాంగులు నడవాలి. ఈ స్థితిలో అంతదూరం నడవటమంటే మాటలు కాదు - పోనీ ఓపని చేస్తే!' అనుకుంటూ తనకు సమీపంలోవున్న గుడిసె తలుపు గెంటాడు గోపాల్.

* * *

అంత ఆకలిలోనూ కూతురి కేదైనా పెట్టాలనే ఆశతో తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో, గోడదూకి గొట్టంసాయంతో పైకిపాకి, బాల్కనీలోపలికి ప్రవేశించి, గది తలుపులు మెల్లిగా నెట్టాడు.

ఆశ్చర్యం!

అవి దగ్గిరగా వేసివుండటం తన అదృష్టమనిపించింది వెంకట స్వామికి.

వెదికి లైటువెయ్యచ్చుకాని, వెయ్యటం మంచిది కాదనిపించింది వెంకటస్వామికి. చుట్టూకలయజూశాడు - మెరుస్తున్న రేడియమ్ ముక్క కనిపించింది. అక్కడికి కదిలాడు వెంకటస్వామి.

-ఏదో అలికిడి అయ్యేసరికి భయంభయంగా చూశాడు వీరభద్రుడు. భార్య అన్నం తీసుకొచ్చి వెళ్ళాక, తలుపు గడియవేయనందుకు తనను తాను తిట్టుకున్నాడు.

ఏమైతే అయిందని ధైర్యంగా ఊపిరి బిగపట్టి కూచున్నాడు వీరభద్రుడు. వెంకటస్వామి కదలివస్తూ రేడియమ్‌పీస్‌నే చూస్తూ బల్ల తన్నేశాడు. దానిమీదున్న కంచం కిందపడిపోయింది. కిందపడిన వస్తువుని తీద్దామని వంగి కూచున్నాడు వెంకటస్వామి. కూచున్న వెంకట స్వామిని మరి లేవనీయలేదు వీరభద్రుడు. అంతేకాదు, అతన్ని గట్టిగా పట్టుకుని "దొంగ దొంగ!" అంటూ గట్టిగా అరిచేశాడు.

*  *  *

లోపలికి వెళ్ళి తడిక దగ్గరికి లాక్కున్నాడు గోపాల్. లోపలి కెళ్ళాక తన అంచనా తప్పుకాదనిపించింది గోపాల్‌కి. ఈతచాపమీద బొంత కప్పుకుని పడుకుని వుందొక అమ్మాయి. మోకాలికి కొద్దిగాపైన ఆ అమ్మాయి శరీరం బొంతకున్న చినుగులోంచి కనిపిస్తోంది. ఉత్సాహం ఎక్కువైంది.

ఎవరైనా ఉన్నారేమోనని గుడిసెంతా కలయజూశాడు-

గుడిసెలో ఒక ఫోటోలోతప్ప మరెక్కడా మనుషులు లేరు. ఆ ఫోటోకేసి తదేకంగా చూశాడు గోపాల్.

ఆ ఫోటోలో ఈతచాపమీద పడుకున్న అమ్మాయి, మరొక నడివయస్కుడు ఉన్నారు. ఆ నడివయస్కుడు ఆమె తండ్రి అయి వుంటాడనుకున్నాడు గోపాల్.

ఎందుకో అదోలాటి భయం వేసిందతనికి. అందుకే తూలుతూ వెళ్ళి ఫోటోని తీసేసి కింద కనబడకుండా పడేశాడు. ఆ ఫోటో అలా పడేసిన తర్వాత అతనికి కొంతంత ధైర్యం వచ్చింది.

అమ్మాయిదగ్గిరగా నించుని ఆమె కప్పుకున్న చినుగుల బొంత లాగిపడేశాడు. అలాచేయగానే ఒక్కసారిగా బుర్ర దిమ్మెక్కిపోయిం దతనికి. ఆమె వంటిమీద బట్టల్లేవు-

ఆమె కట్టుకోవటానికి బట్టల్లేక చినిగిపోయిందో చివికిపోయిందో ఆ బొంతలో తన మానాన్ని కప్పుకుందన్న సంగతి మైకంలోవున్న గోపాల్ గ్రహించలేకపోయాడు.

ఆమె నీరసంగా కళ్ళుతెరిచి గోపాల్ని చూసింది. ఆమె ఎక్కడ అరచి గోలచేస్తుందోనని మీద పడబోయాడు గోపాల్. ఆమె అరవ లేదు, కరవలేదు. కాపోయినా అరవటానికీ, కరవటానికీ ఆమెకు ఓపికెక్కడుంది ?

ఆమెకు అతను తన శీలాన్ని హరించటానికి వచ్చిన రాక్షసుడిలాగ కనిపించలేదు. తన ఆకలి పోగొట్టడానికి వచ్చిన దేవుడిలాగ కని పించాడు.

'ఆగండి!' మెల్లగా అని, చేత్తో ఆగమన్నట్టుగా సైగచేసింది ఏమిటన్నట్టు చూశాడు గోపాల్.

నాలికతో ఓసారి పెదాలు రెండూ తడుపుకుని అందామె 'ముందు సాకేదైనా తింటానికి పెట్టండి. ఆ తర్వాత మీ యిష్టం...'

అంత మైకంలోనూ షాక్ తిన్నాడు గోపాల్. అయినా వెంటనే తేరుకుని, 'ఇదుగో, ఈడబ్బు తీసుకో!" అన్నాడు.

'డబ్బు నేనేం చేసుకోను?'

'తిండి నేనెక్కణ్ణించి తేను!'

'......................'

'పోనీ ఇది తీసుకో!' అంటూ జేబులోంచి బాటిల్ తీసి, ఆమె పక్కగా కూచుని నోట్లోపోశాడు. కొంచెం - కొంచెం. ముందు వెగటుగా అనిపించి, తోసేసినా ఆ తర్వాత విస్కీనే ఆబగా తాగిందామె. మరి కొంచెం అమె నోట్లోపోసి, మిగిలింది తన నోట్లో పోసుకుని, బాటిల్ విసిరేసి, విస్కీతో తడిసిన ఆమె పెదాలను తన పెదాలతో అందుకున్నాడు గోపాల్. అవును. అతను శవంతోనైనా సరే, భోగించే స్థితిలో వున్నాడు మరి!

* * *

ఇంటికెళ్ళిన గోపాల్‌కి తెలిసింది - తమ ఇంట్లో దొంగపడ్డాడని, ఆ దొంగని అతి చాకచక్యంతో తన తండ్రి పట్టుకొని పోలీసులకి వప్పజెప్పాడని.

సాయంత్రం నీట్‌గా డ్రెస్‌చేసుకుని, ఎదో పనిమీద వెళ్తూ పోలీసు స్టేషన్లోవున్న దొంగని చూడాలనిపించి స్టేషనుకెళ్ళాడు గోపాల్.

ఇనస్పెక్టర్ దగ్గిర కూచుని కాసేపు మాట్లాడిన తర్వాత దొంగని చూపించమని అతను అడక్కుండానే అడిగాడు ఇనస్పెక్టర్ "నిన్న రాత్రి మీ యింట్లో దొంగతనానికి వచ్చిన వాణ్ని చూస్తారా?" అంటూ.

తలూపాడు గోపాల్.

తీసికెళ్ళి చూపించాడు ఇన్‌స్పెక్టర్.

ఇనస్పెక్టర్ చూపించిన మనిషిని చూసి కాసేపు చలనం కోల్పో యాడు గోపాల్.

ఆ దొంగ ఎవరో కాదు—

"నిన్నరాత్రి తను ఊరి చివర ఇంట్లో చూసిన ఫోటోలో వున్న మనిషి. అంటే అతని కూతుర్నే తను..."

ఆ తర్వాత ఏమీ ఆలోచించలేక పోయాడు గోపాల్. అప్రయ త్నంగా నిన్నరాత్రి ఆ అమ్మాయి మాట్లాడిన మాటలు గుర్తొచ్చి మన సంతా అదోలా అయిపోయిందతనికి.

గోపాల్ మందు కొట్టకుండా వుంటే మనిషిలాగే ఆలోచించగలడు అందుకే ఆలోచించాడు—

"వాళ్ళిద్దరికీ ఎన్నాళ్లనించి తిండి లేదో? అతని ఆకలి, కూతురి ఆకలి పోగొట్టుకోవటానికి అతను దొంగతనానికొచ్చాడు. వాళ్ళది తింటానికి లేని ఆకలి. లక్షలు సంపాదించిన తన తండ్రికి డబ్బాకలి. ఎంత సంపాదించినా ఇంకా ఇంకా సంపాదించాలనే వెర్రి ఆకలి. మరి తనకో?

ఎంత తాగినా తాగాలనిపించే మందాకలి, కొత్త కొత్త అమ్మాయి లను చేపట్టాలనుకునే ఆడాకలి!

అతను తన ఇంటికొచ్చి ఏమీ దోచుకోకుండానే పట్టుబడితే, తను వాళ్ళింటికెళ్ళి అతని కూతురి సర్వస్వాన్ని దోచుకుని కూడ పట్టుబడ లేదు."—ఇలా ఆలోచించాక, అదోలా నిట్టూర్చాడు గోపాల్. ఆ నిట్టూ

ర్పులో అన్యాయంగా బలైపోతున్న వాళ్ళపట్ల చచ్చినంత సానుభూతి వుంది. అంతకన్నా ఎక్కువ జాలివుంది.

అయితే—

ఆ దొంగదే నిజమైన ఆకలి. అతనికన్నా తనకే ఎక్కువ శిక్ష పడాలి అని పోలీసులముందు, సమాజంముందు చెప్పటానికి మాత్రం అతనేమీ ప్రయత్నం చేయలేను